# "తనదాకా వస్తే"

వీరయ్య మంచి విగ్రహపుష్టిగల మనిషి. అతని మేనమామ కేవలం అతని విగ్రహం చూచే పిల్లనివ్వలా. మేనల్లుడి వాటాక్రింద వచ్చే పది ఎకరాల మాగాణీ, ఓ పెంకుటిల్లు, అప్పటికి అతను చదువుతూ ఉన్న చదువూ అవి చూచి అన్నీ విచారించుకొనే ఇచ్చారు. నిజానికి వీరయ్యకు ఏమీ లోపంలేదు.

అతను పెద్దచదువులు చదవలేదు. పెద్దవాళ్ళు కాదుకూడదని పట్టుపడితే చదివేవాడేమో. ఇంటరుమీడియటు నాలుగేళ్లు గడచిపోయినా పూర్తికాకుండా ఉండిపోతూ ఉంటే అతని తండ్రి రాఘవయ్యగారు "అబ్బాయి ఇంక నువ్వు చదువు చాలించి ఇంటికి చక్కావచ్చేయ్. ఈ ఇంటర్ పూర్తికాకపోతే వచ్చిన నష్టం ఏమీ లేదు. వచ్చి లక్షణంగా పొలం చూచుకో" అన్నారు.

"స్కూలుఫైనల్ కాస్త పట్టుపడితే మూడో సంవత్సరం ప్యాను కాలేదా! చదువనీయండి. అతనే ప్యాసవుతాడు. పైగా ఇంటరు ఇన్ని సంవత్సరాలలో పూర్తిచేయాలనే నిబంధనేమీ లేదుగా! ఏడాదికి రెండు సార్లు చొప్పున ఎన్ని ఏళ్ళు అయినా పరీక్షకు కడుతూ ఉండవచ్చును. చదువనీయండి" అని ఆ ఊరి ఉన్నత పాఠశాలోపాధ్యాయుడు, "చదువుతాడు కాని, ఎందుకు తప్పుతున్నాడో తెలియడం లేదు. ఇంకోసారి వెళ్లనీయండి" అని అతనికి పాఠాలు చెప్పిన కళాశాలోప న్యాసకులు చెప్పారు. రాఘవయ్యగారు "మావాడు ఇంటర్ ప్యాసయ్యేసరికే ఇంతకాలం పడుతోందా, తరువాత మరెన్నేళ్ళకు బి. ఏ. అవుతుందో

ఏమో. అయినా ఎందుకీ గొడవంతా? వీడు చదివి ఊళ్ళేల్తాడా ఏమన్నానా? ఆ బి. ఏ. అయినవాళ్లకయినా అందరికీ ఉద్యోగాలు వస్తున్నాయా ఏమిటి? వద్దులెండి'' అని ఆ పంతుళ్లకు సమాధానం చెప్పి కుమారుడి చదువు మాన్పించి ఇంటికి తీసుకొనివచ్చారు.

వీరయ్య కూడా ఈ విషయంలో అంతగా పట్టుదల చూపలేదు. ''ఇప్పటికే నాలుగువేలయింది. ఇంకా డబ్బు దండగపెట్టడం దేనికి?'' అనుకొని ఇంటికి చక్కా వచ్చాడు. అలా జరిగింది కనుక అతను పెద్ద చదువులు చదవలేదు కాని లేకపోతే చదివేవాడేమో.

అదీకాక ఇంటరు రెండో సంవత్సరం చదువుతూ ఉండగా మేనమామ పిల్లనిస్తానని వచ్చాడు. ''వీరయ్యకు ఇప్పుడు పెళ్ళితొందర ఏమొచ్చిందిలే'' అని రాఘవయ్యగారు అడ్డుమాట అన్నారు కాని, వారి భార్య "అయిన సంబంధం, ఇంటికి వచ్చిన సంబంధం కాదనకూడదు, చేసెయ్యండి" అని పట్టుబడితే, సరే కానిమ్మన్నారాయన. ఇప్పుడు పిల్ల కాపరానికి వచ్చింది. "వీడు ఏమన్నా చదివి వెలిగిస్తుంటే పోనీ-కోడలుపిల్ల వాడి చదువుకు ఆటంకం లేకుండా ఇక్కడ ఉన్నదిలే అనుకోవచ్చు. చదువూలేక ఇంటిపట్టునా ఉండక ఎందుకీ ఎడబాటు - పైగా దండగఖర్చు దేనికి?" అని రాఘవయ్యగారు అతన్ని ఇంటికి తీసుకొని వచ్చారు. పెద్దచదువులు లేకపోవడం వీరయ్య కేలోపం కాలేదు. పిల్ల నిచ్చిన మేనమామ కూడా అది ఒక లోపం అనుకోలేదు. "ఏదో స్వగ్రామంలో ఉండి పొలం చూచుకుంటే చాలు" అనుకున్నా రాయన. అలాగే గడిచింది కూడానూ. ఏ లోపం లేకుండానే గడిచాయి రోజులూ, సంవత్సరాలూ.

''సంతానం కల్గింది. మంచి రైతు అయ్యాడు. సొంత ఇల్లు వుంది అన్నీ బాగానే ఉన్నాయి. వీడికా ఒక్క లోపం లేకపోతే నేను

అందలమెక్కి ఊరేగినంత సంబరపడేవాణ్ణే" అనుకొనేవాడు అతని మేనమామ.

అతనియందున్న లోపమల్లా ఒక్కటే. అది ఆయన కోపిష్టి మనిషి కావడం. "మీ పెద్దబ్బాయికి మీలాగే ఎప్పుడూ ముక్కుమీదే ఉంటుంది కోపం," అని రాఘవయ్యగారిని ఎత్తిపొడుస్తూండేది వారి భార్య. "నీ కోడలేం తక్కువదా! దాని గడుసుదనం మాట చెప్పవేం? అదికాస్త సద్దుకొనిపోతే పోట్లాటదాకా ఎందుకు వస్తుందీ? అయినా ఎక్కడికి పోతాయిలే బుద్ధులు, మేనత్త పోలికలు ఆమాత్రం ఉండకుండా పోతే ఎలా" అని తిరిగి ఎత్తిపొడిచేవారు రాఘవయ్యగారు.

ఆ ముసలి దంపతులు పైఎత్తున ఉండి కాస్త కనిపెట్టుకొని వస్తూన్నంతకాలం ఆ సంసారం కొంత నజావుగానే గడిచిపోయింది. వాళ్ళు ఉన్నప్పుడు కూడా అనుదినమూ, వాళ్ళు ఇద్దరకూ ఏదోవిధంగా సర్దిచెప్పకొని పోతున్నా, పిల్లలను క్రిందకు దించకుండా గారాబంగా చూస్తూ కొడుకూ్కి కోడలుకూ తమ సంతానభారం కన్పించకుండా చేసుకొని పోతున్నప్పుడు కూడా, వీరయ్యా అతని భార్యా తగువులాడు కోని రోజు ఉండేదికాదు. ఏదో స్వల్పవిషయముపై ఇద్దరూ వాగ్వివాదంతో ఆరంభించి కీచులాడుకొని, నువ్వెంత అంటె నువ్వెంత అనుకొని "ఇంక నువ్వు నోరుమూసుకుంటే మంచిది" అని అతను బెదరిస్తే 'తమరు ఊరుకుంటే అంతకంటె బాగుంటుంది' అని ఆ పిల్ల అని, ఆమాటే పదిసార్లు రెట్టించుకొని, గొంతులు పెద్దవి చేసుకొని అరుచుకొనే వారు, అదపా తదపా వీరయ్య చెయ్యిచేసుకొనేవాడు. చేంపదెబ్బ తినగానే ఆపిల్ల తోకతొక్కిన ఉరగాంగన అయ్యేది మరి కాసేపటిలో దెబ్బతిన్న ఆడపులి అయ్యేది. ఇక అపళంగా వెక్కి వెక్కి ఏడుస్తూ పడకగది దగ్గరనుండి అయిదారు గుమ్మాలు దాటి వరసగా తలుపులన్నీ

డబడబలాడిస్తూ అత్తమామలుఉండే మండువా గదిలోకి వెళ్ళి విషయమంతా సవివరంగా చెప్పికొని గంటసేపు ఏడ్చి, నేరస్థాపన, ఓదార్పు అంతా జరిగి, "వాణ్ణి నేను కేకలేస్తానులే అమ్మాయి, ఇంక నువ్వు ఊరుకో" అని మామగారిచేతకూడా అనిపించుకొని, అక్కడే జంపకానా పరుచుకొని దుప్పటి కప్పుకుని పడుకునేది. ఇలా చాలా సార్లు జరిగింది. అప్పుడు ఆపిల్లకు చిన్నతనం.

పైగా స్వభావరీత్యా ఉన్న పెంకెతనం. అదీగాక నిన్న మొన్నటి దాకా పుట్టింట్లో గారాబంగా గడిపి వచ్చిన పిల్ల అవడం, ఇవన్నీ తోడైనాయి. "ఓరేయ్ అబ్బాయి ఏమిట్రా ఈ పోకిరీతనం, కోడల్ని కొట్టావు పెందుకూ?" అని తల్లి అడిగితే వీరయ్య "అదాఒట్టి గయ్యాళి గంప.దాన్ని పట్టుకొని తన్నినా తప్పులేదంటాను" అనేవాడు. "సరే అది కొంచెం గయ్యాళిది అనిఒప్పుకొందాం, నీమంచితన మేమయింది. అది దాన్ని చీటికీమాటికీ చెయ్యి చేసుకుంటారా! ఎవరైనావింటేఎంత అప్రతిష్ఠ, దానికీ చిన్నతనం, ఒరేయ్ నువ్వీసారి ఇలా చేశావంటే మాట దక్కదు. అయినా ఈ విషయం నా తమ్ముడికి తెలిస్తే వాడెంత బాధపడతాడో", అనేది ఆవిడ.

ఆవిడ తమ్ముడికి ఈ విషయం చాలా ఏళ్ళ తరువాత తెలిసింది. ఆయన చాలా బాధ పడ్డాడు. పిల్లలు పుట్టాక వీళ్ళ కీచులాట తగ్గుతుంది అనుకొని కొన్నాళ్ళు ఊరుకొన్నాడు. నలుగురు పుట్టాక కూడ ఆ వ్యవహారం అట్లాగే నడుస్తున్నదని తెలుసుకొని ఆయన ఎంతో బాధ పడ్డాడు. "అమ్మాయ్ నువ్వు వాడితో ఏ విషయంలో అయినాగాని వాదన పెట్టుకోకు. వాడు అసలే కోపిష్టి మనిషి. మనిషి స్వభావం తెలిశాక మనమే సర్దుకుపోవడం నేర్చుకోవాలి." అని కుమార్తెకు నచ్చ చెప్పేవాడు. మేనల్లుణ్ణి పండుగకు ఇంటికి తీసుకొని వెళ్ళి కొత్త

బట్టలుపెట్టి "ఒరేయ్ అబ్బాయ్ నీవు చదువుకున్నవాడివి, అది ఒట్టి అజ్ఞానురాలు. నవ్వు కోపం తగ్గించుకో, చీటికి మాటికీ కొడుతున్నావట అదేమీ బాగాలేదు. ఏదో అయిన వాడివని, ఊళ్లో సంబంధం అనీ నీకుయిచ్చి చేశాను అది నా యింటికి పెద్దపిల్ల, అందువల్ల కొంచెం గారాబం చేశాం. పెంకెతనం చేస్తుంటే చెయ్యొచ్చు, తప్పంతా నీదేనని నే ననడంలేదు. దానిదే తప్పయినా నిన్ను కాస్త సర్దుకు పొమ్మని చెబుతున్నాను. ఇంట్లో ఇద్దరు పెద్దవాళ్లున్నారు తగవు వస్తే వాళ్లకు చెప్పండి. లేకపోతే నాకు చెప్పండి అంతేగాని మీరు పోయిన పొడుగూతా ఇల్లా కీచులాడుకోకండి 'నా మేనల్లుడు ఎంతో బుద్ధిమంతుడు అని తెగ పొగిడి ఇచ్చి చేశారుగా! ఎంత లక్షణంగా ఉందో చూస్తూనే ఉన్నాం, అని నన్ను ఎత్తిపొడుస్తున్నది మీ అత్త. అవన్నీ అలా ఉంచు, ఈ విషయం నాకు ఎంత బాధగా ఉంటున్నదో నీవేమన్నా ఆలోచించావా?" అంటూ ఆయన ఎన్నోవిధాల మేనల్లుడికి చిలుకకు చెప్పినట్లు చెప్పేవాడు, కాని ఆ చిలుక ముక్కుతో పొడవటం మానలేదు.

కాలం గడిచిపోయింది. రాఘవయ్యగారు పోయినప్పుడు "ఎంత మంది డెబ్బైయేళ్ళు బ్రతకడంలా! బావ మరో పదేళ్ళు ఉంటే బాగుండేది. ఇంక వీళ్ళను కనిపెట్టుకొని ఉండేది ఎవరు? నా చెల్లెలు ఉన్నదన్న మాటేగాని దానిమాట ఏం సాగుతుంది? ఎల్లా గడుస్తుందో ఈ సంసారం:" అని వీరయ్య మామ దిగులుపడ్డాడు.

ఆయన భయపడ్డట్లుగానే వీరయ్య కోపం ఆరోజు కారోజు హెచ్చిందేకాని తగ్గలేదు. రాఘవయ్యగారు పోయాక ఆ ఇంటి కోడలు చాలా మారింది. ఇంక ఆయనకు చెప్పేవారులేరు. అత్త చెప్పినాఒకటే చెప్పకున్నా ఒకటే అని అనుకొన్నదో ఏమో బుద్ధి మార్చుకొన్నది.

ఇలా ఆమె మారినా వీరయ్య తామసం మాత్రం తగ్గలేదు

*　　　　　*　　　　　*

వీరయ్యకు ముప్పైఐదేళ్ళు దాటవచ్చాయి. ఆయన భార్యకు ముప్పై నిండాయి ఆయన ఇప్పుడు పెద్ద మోతుబరీ రైతుకూడా అయ్యాడు. ఆవిడ ఇప్పటికే పదిహేను, పదహారు సంవత్సరాల సంసార జీవితం గడిపింది. పెద్ద కూతురు పెళ్ళి ఈడుకు వచ్చింది. ఆ పదిహేను సంవత్సరాల సంసారిక జీవితకాలంలోనూ మొదటి రోజులలో లెంప కాయలు, ఆ తరువాత రోజులలో తన్నులు తినకుండావున్న రోజులు వేళ్లమీద లెక్క పెట్టుకోగల దావిడ. "వయస్సు వచ్చి పడుతున్నకొద్దీ యీయనకు తామసం పెరుగుతోంది. ఊరుకున్నకొద్దీ రెచ్చిపోతున్నారు. ఎల్లా ఈయనతో ?" — అనుకొని కంటనీరు పెట్టుకొన్న రోజులు ఎన్నో ?- ఆమె తండ్రివచ్చి వీరయ్యను బ్రతిమాలుకొన్నది ఎన్నిసార్లో ! ఆయన అలా చాలాసార్లు వచ్చారు.

అలా వచ్చి వీరయ్యను దగ్గర కూర్చోబెట్టుకొని "సొంత మేనల్లుడివికదా అని చనువు తీసుకుంటున్నా, నువ్వేమీ అనుకోకు. అది నలుగురు పిల్లల తల్లి అయింది. అటువంటిదాన్ని పట్టుకొని గొడ్డును బాదినట్లు బాది వదలిపెడుతున్నావట. అందుకేనా దానిని నీకిచ్చి చేసింది ? అదేమంటే ముఖం కందగడ్డ చేసుకుంటావు ! దాని పెంకితనం తగ్గిందా అంటావు ! బావవు కనుక కొంచెం స్వతంత్రంగా మాట్లాడుతుంది. అట్టే చదువుకొన్నదికాదు గనుక తెలివి తక్కువగా ప్రవర్తిస్తుంది. నీ కెన్నిసార్లో ఇలావచ్చి చెప్పుతున్నాను. అయినా నీకేమీ ఎక్కడంలేదు. ఇన్నేళ్లువచ్చినా ఇంతేనా... అయినా నీకు చెప్పుకొనిమాత్రం ఏం లాభం ! నాబాధ నీకేం తెలుస్తుంది" అని కళ్ల నీళ్లు పెట్టుకొనేవాడు వీరయ్య మేనమామ. "లేదులే మామయ్యా, ఇంక

కొట్టనులే." అని అంటూ వెనుదిగిరి వెళ్ళిపోయేవాడు వీరయ్య. అలా వెడుతూ "అదేమిటి అలా ఆడదానిలా కళ్ల నీళ్లు పెట్టుకుంటాడు? అదేదో మాటకు మాట అన్నది నేను కోవంవచ్చి ఒకదెబ్బ వేశాను. ఈమాత్రానికి ఈయన కళ్లనీళ్లు పెట్టుకోవాలా ఏమిటి? తనకెంత అధికారమున్నదో నాకూ అంత అధికారమున్నది. కోవంవస్తే, కూతురైతే మాత్రం, తనో దెబ్బ వెయ్యకుండా ఉంటాడా? నేనూ అంతే అనుకోరాదూ? పనివేళావచ్చి నాకు చెప్పడం దేనికి?" అనుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయేవాడు.

అతని మేనమామ వరండాలోనే కూర్చుని చెల్లెలితో మాట్లాడుతూ "ఏమే అమ్మాయి, నీ కొడుకు పోకడేమీ మారిందికాదు. నేను చెప్పినప్పుడల్లా ఇంక కొట్టనులే మామయ్య అని అంటాడు. కాని మానడు. ఎక్కడ్నించి వచ్చిందో వీడి కీకోపం, నాకేం అర్థం కావడంలేదు. దాన్ని ఎంత గారాబంగా పెంచానో ఎన్నడైనా దాని వంటిమీద అలా ఒక్క దెబ్బ వేశానా? అంత గారాబంగా అల్లారుముద్దుగా పెంచి పెద్దదాన్నిచేసి వీడికిచ్చిచేస్తే–వీడికోపం పాడుగానూ, ఊ అంటే ఆ అంటే బాత్తాడా? ఏదోఅంటే తప్పుఉండకుండా ఉంటుందా మనిషన్నతరువాత; స్వల్పమైన పొరపాట్లు తెలిసో తెలియకో చేస్తూనే ఉంటాడు—అదేమిటి, మగేమిటి? ఆమాటకొస్తే వీడు ఎన్ని చేశాడుకాదు? ఇంటరు ఎందుకు తప్పాడు నాలుగుసార్లు? చదు వెవ్వరు మానెయ్యమన్నారు? పోనీ బావ వీడ్ని అప్పటికి చదువు మానిపించి ఇంటికి తీసికొచ్చారే అనుకుందాం. ఆ తరువాత ప్రైవేటుగా ఎందుకు చదవలా? తన తరవాత వాళ్ల సొంత తమ్ముళ్లు చదివి ప్యాసై ఇప్పుడు పెద్ద ఉద్యోగాలు చెయ్యడంలా! పోనీ పొలం చూస్తున్నాడులే అనుకుంటే అదీ అంతమాత్రంగానే వుందే! సరే ఎంచి చెప్పాలంటే లక్షాతొంభై వున్నాయి. తన్నెవరైనా దండిస్తున్నారా? లేదే, అలాగే ఇతరులనుకూడా కాస్త క్షమించవద్దూ!

కోపం వస్తుందట కోపం! మాఅందరికీ రాదా ఏం! కోపం వస్తే కాస్త తమాయించుకోవాలి తమాయించుకున్నప్పుడే మనిషనిపించుకోవడం, మన దొడ్లో గొడ్లున్నాయి వాటికి కాస్త కోపంవస్తే ఎదుటనున్న మనిషిని పొడుస్తాయి. మనిషికూడా అల్లాగేచేస్తే ఇంకవాటికి మనకూ తేడా ఏమిటీ అంటాను." అనేవాడు, అన్నిమాటలూ విని వీరయ్య తల్లి "ఊరుకోరా తమ్ముడూ వాడివన్నీ విన్నాడా నీతోకూడా తగువుకొస్తాడు ఎందుకొచ్చిన పోట్లాటలు. నేను ఎన్నిసార్లో బ్రతిమాలి చెప్పాను వాడికి. సరే నంటాడు. మరునాటికల్లా బుద్ధి గడ్డితింటుంది. పోనీ ప్రేమల్లేవంటావా అలా అనడానికి వీలులేదు. పెట్టెడు చీరలు కొంటాడు. కోరిన నగలు చేయిస్తాడు. టాక్సీకారు కట్టించుకొని సినీమాకు తీసికెడతాడు. కాని కోపంవస్తే—అయినా ఇటువంటి విషయాలు ఒకరు చెబితే తెలిసేవికావు. వాడిఅంతట వాడికి తెలియాలి ఆ తెలియడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో నాకర్థం కావడంలేదు. నాఖర్మ ఇదంతా. ఈ బాదరబందీ అంతా వదిలించుకొని చక్కా పోయారు మీ బావ. ఈ బాధలన్నీ చూడవలసినస్థితి నాకు పట్టింది. ఏం చెయ్యమంటావు చెప్పు" అని అంటూ తన నిస్సహాయతను వెళ్లడించుకుంటూ తనూ కళ్లనీళ్లు పెట్టుకొనేది. "నిజమేనే అమ్మాయీ, ఇది నీ ఖర్మా, నాఖర్మా కూడానూ. ఏం చెయ్యడానికీ తోచడంలేదు. బిడ్డకు దెబ్బతగిలిందని తెలిసినప్పుడల్లా నా గుండె తరుక్కుపోతుంది." అంటూ బొటబొట కారే కన్నీటిని ఉత్తరీయంతో అద్దుకొని దుఃఖాన్ని దిగమ్రింగుకొని "పోయొస్తానే, దానితో నేను అల్లుడితో చెప్పి వెళ్లానని అనకు. నామీద కేకలేస్తుంది" అంటూ ఉత్తరీయం దులుపుకొని వెళ్ళిపోయేవాడాయన. వారిద్దరి మాటలూ వెనుకనుండి చాలాసార్లు విన్నాడు వీరయ్య. విని కాసేపు వళ్లుకొరుక్కొని "ఏదో వాక్కుంటున్నాడులే వాక్కోనీ." అనుకొని వినుక్కొని దొడ్లోకి వెళ్ళిపోయేవాడు. ఇలా చాలాసార్లు జరిగింది.

ఇలా జరుగుతూ ఉండగానే కాలం గడిచిపోయింది. "పిల్లకు పదహారోయేడుకూడా వస్తున్నది. పెళ్ళి చెయ్యవేమిరా? అసలా మాటే అనుకోవేరా" అని తల్లీ, "రత్నకు పెళ్లిసంబంధం ఏదైనా ఖాయం చేసుకున్నావుటోయ్? - ఇంకా ఎన్నాళ్ళు! అటు చదువూ చెప్పించక ఇటు పెళ్ళీ చెయ్యక ఇంట్లో కూర్చొ పెట్టుకోవడం బాగుండదు. త్వరగా నిశ్చయం చేసుకో." అని మామ పోరు పెట్టగా తన గారాబాల కూతురుకు ఆ పిల్ల పద్దెనిమిదోయేట పదివేలు కట్నం కుమ్మరించి చాలా ఘనంగా వివాహం చేశాడు వీరయ్య. "ఊళ్ళో ఉంటూంటే మనఇష్టం వచ్చినప్పుడల్లా వెళ్ళి చూడొచ్చు, తీసుకొనివస్తూ వుండొచ్చు. కుర్రవాడు చాకులావున్నాడు. ఇంత మంచిసంబంధం దొరకడమే కష్టం" అని వీరయ్య పొంగిపోయాడు. పెళ్ళినాడు ఆ నూతన వధూవరులను చూచి ముచ్చటపడనివాళ్ళు లేరు.

రత్నం నిజంగా రత్నమే. ఆపిల్ల అందమే అందం చిదిపి దీపం పెట్టవచ్చు నిలువెత్తు బంగారపు విగ్రహం ఎవరో పోతపోశారా అనిపిస్తుంది, ఆపిల్ల ఒక్క క్షణం కదలకుండా నిలబడితే, శరత్కాలపు మేఘాలకు మాత్రం ఇంతవయ్యారం ఉంటుందా అనిపిస్తుంది, ఆపిల్ల అలా ఒక్క నాలుగడుగులు నడచివెళుతూంటే, అప్పుడే విచ్చుకుంటున్న మల్లెమొగ్గలకు మాత్రం ఈ సొగసు ఉంటుందా అనిపిస్తుంది. ఆపిల్ల కొంచెము తలవంచుకుని అలా ఒక్కసారి తలఎత్తి మధురమందహాసం చేస్తే ఏదైనా నాటకంలో రతీదేవి అవసరమైతే ఈపిల్లను వేషం వెయ్యనక్కరలేకుండానే ఉన్నవళంగా రంగస్థలంమీదకు తీసికొనివస్తే చాలు సరిపోతుంది, అనిపిస్తుంది కాస్త నిదానించి ఆపిల్లను గమనిస్తే. "ఈ అందాలభరిణ ఈ సుకుమారి అత్తింట్లో వనేంచేస్తుందిరా?" అని నవ్వుతూ వీరయ్యతల్లి తన తమ్ముడిని అడిగితే "ఎంత సుకుమార పిల్లయినా తప్పదుగదటే! ఆమాటకొస్తే నాకూతురు నీయింటికొచ్చి చెయ్యలా?" అన్నాడు ఆయన.

పెళ్ళిఅయిన ఆరు నెలలకు ఆ పిల్ల కాపురానికి వెళ్ళింది.

*　　　　*　　　　*

కూతురు కాపరానికి వెళ్లిన ఆరు నెలల తరువాతగాని కుమార్తె అత్తవారింటిపేరు కస్తూరివారనీ, ఇంట్లో గబ్బిలాల కంపనీ తెలియలేదు వీరయ్యకు. ఆ సంగతి తెలిసిన తరువాత అందుకు సంబంధించిన వివరాలన్నీ ఒకటొకటే ఒకదాని తరువాత మరొకటి తెలియవచ్చాయి.

రత్న అత్త గయ్యాళిగంప. మామ ఏమీ పట్టించుకొనే మనిషి కాడు. ఆయిన చాలా నెమ్మదస్తుడు: ఆస్తి ఎంతఉందో అప్పుకూడా అంతఉంది. అదంతా ఆయన ప్రయోజకత్వమే.

రత్నం మొగుడు మనిషి అందగాడే, చదువు గొప్పదే చేస్తున్న ఉద్యోగం చెప్పుకోతగిందే. కాని వివేచనాజ్ఞానం తక్కువ. ఎవరేమి చెబితే అదల్లా వింటాడు. విని ఊరుకోవడం కాదు. నమ్ముతాడు. దానికితోడు కోపం ముందుపుట్టి ఆ తరువాత అతడు పుట్టాడు. ఆ కుటుంబంలో ఆలస్యంగా పుట్టిన ఏకైక మగసంతానం అతనే కావడం వల్ల కావలసినంత గారాబం. అందువల్ల పెంకెతనంకూడా అబ్బింది. "నీ కొడుకు వ్యవహారం ఏమీ బాగాలేదు వాడి కిప్పుడే ఇంత కోపం పనికిరాదు. నువ్వే వాడిని పాడుచేస్తున్నావు. కొంచెం అదుపులో పెట్టుకోవాలి. నామీదే తన ప్రతాపం చూపించటానికికూడా వాడు సందేహించడంలేదు. ఎడ్డెం అంటే తెడ్డెం అంటున్నాడు." అని ఎన్నోసార్లు ఆయనచెబితే "వాడెప్పుడూ అలాచెయ్యడు అసలు వాడికున్న బుద్ధిలో ఒక వెయ్యోవంతు మీకుంటే నేనెంత సంతోషిద్దునో! ఈ సంసారం ఎంత బాగుపడేదో!" అని మొదలు పెట్టి ఆవిడ ఆయన మీదకు తగువుకు సిద్ధమయ్యేది ఆ మాటమీద ఆయన "వాడిని కాస్త అదుపులో పెట్టవే అని నేను చెప్తే నాకు బుద్ధిలేదంటావ్, ఇదేమన్నా

మర్యాదగా వుందా అంట." "ఇప్పడీ సంసారం బాగుండక చెడి పోయిందేమిటీ? ఎన్నేళ్లువచ్చినా నీ గయ్యాళితనం పోనిచ్చావు కాదు." అంటూ ఆయన ఎంతో సింపాదిగా నిమిషానికొక మాటచొప్పున ఆగి ఆగి మాట్లాడేవాడు. ఆవిడ వారి మాటలు లెక్కచేసేది కాదు. అందువల్ల రత్న మొగుడు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగించాడు. చిన్న తనమంతా, అతను ఆ ఇంట్లో కొంచెమో గొప్పో భయపడినదల్లా ఒక్క తల్లికే. ఆవిడకు అతనంటే ఎక్కడలేని గారాబం, అభిమానం, తాత్కారణాన అతను తల్లికైనా భయపడి తగ్గవలసి వచ్చిన సందర్భాలు బహుస్వల్పం.

"ఒరేయి అబ్బాయి—అది తలనిండా పూలు పెట్టుకొని సాయంత్రింపూట అలా వాకిట్లో నిల్చోడం నాకేమీ బాగాలేదురా. సంసార్ల కొంపల్లో ఇల్లాంటివెక్కడా చూడలేదు, నా మట్టుకు నేను" అని ఆ తల్లి అనడం ఆలస్యం, అతను "ఏమే తలనిండా అన్ని పువ్వు లెందుకూ? పైగా వాకిట్లో నిలబడడం ఎందుకూ? ఇంకెప్పుడైనా ఇలా జరిగిందా నే నూరుకొనేది లేదు. తెలిసిందా?" అనేవాడు భార్యతో. ఆపిల్ల "ఇంతలోకే తప్పొచ్చిందా! అదో పెద్ద నేరమా! నే నెక్కడా వినలేదింత విడ్డూరం! తప్పని మీ అమ్మ చెప్పిందా?" అని అడిగేది. "ఇంతకుముందు వినకపోతే ఇప్పుడు వింటున్నావుగా. మా అమ్మ పెద్దదిగనుక చెప్పింది. ఏం ఆవిడ చెప్పడానికి అధికారం లేదా?" "అధికారం ఎందుకుండదూ! పోనీ తనూ నలభై ఏళ్ళువచ్చినా తట్టెడు పూలు పెట్టుకొని నిన్న సినీమాకు ఎలా వెళ్ళిందో మరి!" అంతే ఆ మాట పూర్తికాక ముందే చెంప చెళ్లుమనేది. "నువ్విలా చెయ్యాలి అని నేను చెబితే మీ అమ్మ అలా చేస్తోంది, ఇలా చేస్తోంది, అది బాగుందా, ఇది బాగుందా?" అని ఎదురు ప్రశ్న వేస్తావేం?" అని చెంపదెబ్బ తిని ఉద్వేగం ఆగక వెక్కి వెక్కి ఏడుస్తున్న భార్యను

సాధించేవాడు. ఆ పిల్ల ఇక ఆ పూటకు ఒక్కమాట కూడా మాట్లాడేది కాదు. పచ్చి లంఖణం చేసేది.

ఒకసారికి కారణం ఇదీ, మరోసారి మరో కారణం. ఆపిల్ల మాటకారి కావడంవల్ల ప్రతిదానికీ ఏదో సమాధానం చెప్పకా మానదు, అతను కోపదారి కావడంచేత దెబ్బవెయ్యకా మానడు. దానికి తోడు పగలు పొద్దస్తమానమూ అత్తగారి ఎత్తిపొడుపులూ సాధింపులూ. సాయంత్రం అతను ఇంటికి రాగానే ఆవిడ పితురీలు చెప్పడం, అదో పరిపాటయింది ఆ ఇంట్లో. "ప్రతిదానికీ ఆవిడగారు ఎంత అత్తగారైతే మాత్రం కల్పించుకోవడం బాగుందా? నేను ఎర్రజాకెట్టు వేసుకొంటే హాస్పిటల్లో ఆయాలగున్నావు. విప్పేయ్ అంటుంది. తెల్లచీర కట్టుకుంటే పొద్దున్నే తెల్లచీరకట్టావు, ఇంక పనీ పాటా ఏమీ చెయ్యవా ఏమిటీ? అది విప్పి మరో రంగు చీర ఏదైనా చూచి కట్టుకో అంటుంది. ప్రతిదాంట్లోనూ ఆవిడ పెత్తనమే. కాస్త డికాక్షను ఎక్కువ పోసుకుంటే తప్పు, ఇంకోసారి కాఫీ తాగితే తప్పు. మధ్యాహ్నం కాఫీ తాగటం మానెయ్యాలట. ఇన్ని సార్లు కాఫీలు తాగితే కొంప గుండం అయిపోతుంది. నీకసలు పొదుపు లేదేమిటే! అంటుంది." అని మొగుడితో ఆపిల్ల అనేకసార్లు చెప్పుకొన్నది. కాని అతడు వినుపించుకొనేవాడు కాదు. పైగా "అంటే అన్నదిలే వూరుకో, పోనీ ఆవిడ చెప్పినట్లే విను" అని సలహా చెప్పేవాడు. మా నాన్న పదివేలు కట్నం పోసింది నేను వీళ్ళ ఇంట్లో బానిసగా కుదరడానికేనా ఏమిటి, అని ఉక్రోషం వచ్చేదాపిల్లకు. దాంతో అప్పటిదాకా ఎన్ని అన్నా సాధారణంగా ఎదురు చెప్పక పడి ఉండేదల్లా ఒక్కసారి ఎదురు తిరిగి అత్తగారిని నాలుగు దులిపేది. అందుకు ఫలితంగా దెబ్బలు తినేది

"ఒరేయ్ అంతమాత్రానికే కోపం రావాలిరా నీకు? అత్తా కోడలూ మాటామాటా అనుకోబట్టే తగూఅయింది. చెయ్యీ చెయ్యీ కలిస్తేనేనా శబ్దం అయ్యేది? ఇద్దరూ ఒకేరకం మనుష్యులు. అటు వంటప్పుడు నీవు ఆ పిల్లను కొట్టడం ఎందుకూ! మీ అమ్మను కాస్త దానిజోలికి పోవద్దని చెప్పలేవేం? తప్పు ఇద్దరి దగ్గరా వున్నప్పుడు చాతనైతే ఇద్దర్నీ కేకలెయ్యాలి. లేకపోతే వూరుకోవాలి అంతేగాని మాటిమాటికి ఆ పిల్లను బాధిస్తే బాగుండదు" అని అతని తండ్రి నెమ్మదిగా అనేమాటలు, అతనే కాదు ఇంట్లో ఎవరూ లెక్కచేసేవారుకాదు కొన్నేళ్లు గడిచాక ఈ విషయాలన్నీ వీరయ్యకు సవివరంగా తెలిసినాయి. తలపట్టుకొని కూర్చున్నాడాయన. లోపల్లోపల అల్లుణ్ణి, కూతురు అత్తగార్నీ తిట్టుకునేవాడు. "ఎరక్కపోయి చేశాను ఈ సంబంధం. అసలు అతనికి చేతులెలా వస్తాయంట" అనుకొనేవాడాయన.

ఏదో భగవంతుడి దయవల్ల వాళ్ళ కడుపున ఒక కాయ కాస్తే ఈ తగవులన్నీ సర్దుకుంటాయి అని ఆశిస్తూ ఏదోవిధంగా కాలం గడిస్తేనే చాలు అనుకున్నది వీరయ్య తల్లి. ఆవిడ ఆశించినట్లుగానే కాలం గడిచింది. నాలుగేళ్ళు ఇట్టే గడిచిపోయినాయి.

*　　　*　　　*

ఆ రోజు అట్లతద్ది. "ఈ పూటకూడా రాలేదే రత్న! మొన్న నేను స్వయంగా వెళ్ళి పెద్దవాళ్ళిద్దరికీ అల్లుడికీ కూడా చెప్పివచ్చానే! అతన్ని కూడా రమ్మని చెప్పానే! అతను రాకపోతేమానె పిల్లను పంపడానికేం? ఉళ్ళో ఉన్నారుకదా అప్పుడప్పుడు అమ్మాయిని పంపవయ్యా అంటే, మా అమ్మతో చెప్పమంటాడు. అబ్బా! అంత అదుపాజ్ఞలలో ఉంటున్నాడుకాబోలు! ఏమిటో! ఇంతకూ ఇది ఇంకా రాలేదేమో"

అని ఆలోచిస్తూ వరండాలో కుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు వీరయ్య

ఇంతలో ఇంటిముందు జట్కా బండి ఆగింది.

'ఎవరబ్బా బండి కట్టుకొని వచ్చింది అమ్మాయే కాబోలు. మరెవరు వస్తారు యిప్పుడు' అనుకుంటూ వీరయ్య తాపీగా లేచి నిలబడి బండివైపు చూస్తూ ఉండిపోయాడు. ఇంతలో రత్న బండి దిగింది. దిగీదిగంగానే ఒక్క అంగలో లోపలకు వచ్చేసింది. తన్ను చూచికూడా పల్కరించనైనా పల్కరించకుండ లోపలకు పోబోతున్న కూతురు వంక చూచాడు వీరయ్య. ఆ మరుక్షణంలోనే ఆయన ఒక్క ఊపునవెళ్ళి కూతుర్ని పొదివి పట్టుకొని "ఏమిటమ్మా ఇదంతా?" అని ఆత్రంగా అడిగాడు, చీరకొంగునిండా అయిన నెత్తురు మరకలను చూచి గాబరాపడుతూ, ఆ చీరకొంగుతో నోరుమూసుకొని ఉన్నదల్లా పిల్ల ఆయన్ను చూడగానే బావురుమన్నది. "ఏమిటే నాతల్లి ఏంజరిగిందో చెప్పవేమే!" అని బుజాలు పట్టుకొని ఊపుతూ అడిగాడు వీరయ్య. ఆయనకు దుఃఖం పట్టరాకుండా ఉన్నది. తడబడుతూ అడిగాడు. రత్న వెక్కి వెక్కి ఏడుస్తూనే చెప్పింది. జరిగిందంతా. "అయితే మళ్లీ కొట్టాడన్నమాట. ఇంత స్వల్ప విషయానికి ఇంతదెబ్బ కొడతాడా! నా బిడ్డను ఇంత దెబ్బ కొడతాడా! ఇప్పుడేవెళ్ళి వీడి అంతు..." అంటూ ఉగ్రుడైపోయాడు వీరయ్య. "నా బిడ్డనింత దెబ్బ కొడతాడా!" అంటూ ఆయన బొబ్బలు పెడుతూంటే ఆ అరుపులు విని ఆయన భార్య బయటకు వచ్చింది.

ఆవిడ వరండాలోకి వచ్చేసరికి రత్న గుమ్మానికి అనుకొని నోటికి చీరకొంగు అద్దుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్నది. వీరయ్య చూరులో ఉన్న కఱ్ఱ బయటకు లాగి చేతితో పట్టుకొని "దొంగ

రాస్కెలు బిడ్డనింత దెబ్బకొడతాడా ? చేతులెలా వచ్చాయంట ! చూడు వీడ్ని ఏమిచేస్తానో !" అంటున్నాడు. ఆయన నిలువునా వణికి పోతున్నాడు, కళ్లవెంట నీరుకూడా కారుతున్నది. ఆయన చొక్కాకుకూడా నెత్తురు మరకలయినాయి

ఆవిడ ఆయనకు దూరంగా నిలబడి "ఎక్కడికండీ కజ్జపుచ్చుకొని బయలుదేరారు. అల్లుడి మీద యుద్ధానికే !, యాభై యేళ్ళు వచ్చిన మీరు కుఱ్ఱ అల్లుడితో కజ్జసామేమి చేయగలరండీ? ఇంక వదండి ఇంట్లోకి, ఎవరైన చూస్తే నవ్వుతారు." అంటూ ఆయన్ను వారించింది.

"అయితే ఏమిటే నువ్వనడం - నాబిడ్డ నింత దెబ్బకొట్టినా చూస్తూ ఊరుకోమనేనా ?" అంటూనే మళ్లీ రత్నను చూచి ఆ పిల్లను దగ్గరకు తీసుకొని తన ఉత్తరీయంతో ఆ పిల్ల పెదవులు ఒత్తి కళ్లు తుడిచి "ఎంత దెబ్బ తగిలిందే నాతల్లీ ! ఎంత గారాబంగా పెంచేనే అమ్మా నిన్నూ !" అంటూ అ ప్రయత్నంగా కన్నీటిని తుడుచుకున్నాడు వీరయ్య. కూతుర్ని చూస్తున్నకొద్దీ ఆయన ప్రాణం గిజ గిజ కొట్టుకుపోతున్నది. తన్నుకొనిపోదామని వచ్చిన గ్రద్దకు దొరక్క దాని కాలిగోళ్లు తగిలి లేతఒళ్ళు చీరుకొనిపోగా పారిపోయి వచ్చిన పిల్లను రెక్కలక్రింద పొదివి పట్టుకొని భయంగా, కోపంగా, జాలిగా చూస్తూ చప్పున అన్ని వైపులకూ దృష్టిమరలిస్తూ కోడిపెట్ట బిడ్డ లేతఒళ్లు కప్పుతూ దుఃఖంతో ఎల్లా వణికిపోతుందో అలా వణికి పోతున్నాడు వీరయ్య.

ఒకవంక దుఃఖం, మరోకవంక కోపం. ఏదోచేయాలన్న దుఃఖంలోనుంచి వస్తున్న ఉద్వేగం. ఏమీ చెయ్యలేనుకదా అన్న నిస్పృహలోంచివస్తున్న నిర్వేదం.

ఆయనిక నిలబడలేక పోయ్యాడు. గోడప్రక్కగా కూలబడ్డాడు.

ఆ పిల్ల అల్లాగే గుమ్మానికి అనుకొని నిలబడి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

వీరయ్య భార్య వాళ్ళకు కొంచెం దూరంగా నిలబడింది. ఒక్క క్షణం ఆయనవంక చూచింది. మరో క్షణం కూతురువంక చూచింది. వీరయ్య తన అల్లుణ్ణీ, కూతురు అత్తవారినీ తిట్టిపోయడంకూడా మొదలు పెట్టాడు. ఆవిడ దూరంగా అలా స్తబ్దుగా నిలబడి ఉండడం గమనించి వీరయ్య ఆమె వంకకు తిరిగి చూచాడు. ఏమిటి దీనికేమి చీమ కుట్టినట్లుకూడా లేదల్లేవుందే! పిల్లదగ్గరకు కూడా పోలేదే" అని అనుకున్నాడు.

ఆవిడ మాటాడలేదు. పైగా ఆవిడ నవ్వింది కూడానూ. "నవ్వుతావేమే బిడ్డకు దెబ్బతగిలిందని నేను ఏడుస్తుంటే నీకు నవ్వు వస్తున్నదేం? ఏం పొగరూ!" అంటూనే ఆయన లేచి నిలబడ్డాడు. ఆయన కోపం ఇటు మళ్ళింది. "ఎందుకే నవ్వావు? అసలు నీకు నవ్వెందుకు వచ్చిందే?" అంటూ ఆమెకు ఎదురుగా నిలబడి రెట్టించి మళ్లీ మళ్లీ అడిగాడు వీరయ్య.

"ఆ ఏం లేదు. మీదాకా వస్తేనేకాని నొప్పి తెలియలేదుకదా అని నవ్వుకొన్నాను. నన్ను ఇన్నేళ్లుకొట్టి హింసిస్తూ వచ్చారే అప్పుడు మా నాన్న ఏడవలా మీతోనూ, అత్తతోనూ చెప్పుకొని? అప్పుడు మీకేమన్నా తెలిసిందీ? ఏదైనా తనదాకా వస్తేనే కాని తెలియదు కాబోలు అయ్యగారికి" అంటూ ఆవిడ నాలుగూ జాడించింది.

ఆయన కిమ్మనకుండా చూస్తూ ఉండిపోయాడు, రెండు నిముషాల దాకా. అప్పటిదాకా ఆవిడేదో మాట్లాడుతూనే ఉన్నది. ఆ తరువాత రెండు మూడు నిముషాల తర్వాత ఆమె శాంతించింది. అప్పటికి గాని ఆమెకు కసితీరిందికాదు. అప్పుడు కనిపించింది కూతురు.

అప్పటిదాకా ఆవిడ ఆ పిల్లపంక చూచినట్లేలేదు. అసలు గమనించినట్లే లేదు. ఇప్పుడు చూచీ చూడంగానే కూతుర్ని ఒక్కసారి కౌగలించుకొని "రా అమ్మా, రా ఏడ్వకు కోపదారి మనుష్యులితో ఇంతలే." అంటూనే ఆవిడ కూతుర్ని పొదివి పట్టుకునే లోపలకు నెమ్మదిగా నడిపించుకొని వెళ్ళి చెయ్యవలసిన ఉపచారాలు చేసింది. వీరయ్య అక్కడే కూర్చుని తల వెనక్కు వాల్చి "ఎంత మాట అన్నదీ! ఎంత మాటన్నదీ!" అని ఆవిడ అన్న మాటలు జ్ఞాపకం చేసుకుంటూ కాసేపు గింజుకున్నాడు. కొంతసేపు తర్వాత కూతురు విషయం జ్ఞాపకం వచ్చి చప్పున కుర్చీలోనుంచి లేచి గబగబా వంట ఇంటివైపు నడిచాడు. వంటఇంటి గుమ్మం దగ్గరే నిలబడి "పోనీ వైద్యుణ్ణి పిలుచుకు రమ్మంటావటే?" అంటూ లోపలకు తొంగిచూచాడు.

రత్న చీర మార్చుకొన్నది. తల్లి ఒడిలో తల వాల్చుకొని పడుకొన్నది ఆవిడ ఆ పిల్ల జుత్తు నిమురు తున్నది ఒక చేత్తో, మరో చేత్తో తన చీర కొంగుతో కళ్లు అద్దుతోంది.

నా కెంత కూతురో, తనకూ అంత కూతురు కదా! ఎప్పుడో తన్ను కొట్టానని ఇప్పుడు నాతో ఇంత కసిగా మాట్లాడుతుందా! ఏమిటి దీనిస్వభావం? అసలు పిల్లకు ఏమైనా ఉపచారం చేసిందాలేదా? పోనీ వైద్యుణ్ణైనా పిలుద్దామా! అనుకుంటూ వచ్చిన వీరయ్య ఆ దృశ్యం చూచి అల్లాగే నిలబడి పొయ్యాడు ఒక్కక్షణం. మరోక్షణం తరువాత కోలుకొని ఏమే నేను వెళ్ళి వైద్యుణ్ణి తీసుకురానా? పోనీ మందేమైనా.?' అని అడుగుతుంటే ఆయన భార్య ఆయన మాటకు అడ్డంవచ్చి "ఏమీ వద్దులెండి మీరు అవతలికి వెళ్ళండి. మందూవద్దు మాకూవద్దు పైగా అదో అప్రతిష్ట కూడానా! నలుగురికీ తెలియడానికా! ఏమీ అక్కర్లేదులెండి ఇంకా నయం వకీలును పిలుచుకొస్తానన్నారుకాదు!

ముందు మీరు ఇక్కణ్ణించి వెళ్ళండి మీకు పుణ్యముంటుంది" అని అంటూ ఆవిడ భర్త కళ్ళల్లోకి చూచింది.

రుద్ధమైన ఆవిడ కంఠాన్నీ, కన్నీరు తుడుచుకోగా తుడుచుకోగా ఎర్రబడి ఉబ్బినకళ్లనూ చూచి లోపల బాధపడుతూ భారంగా అడుగులో అరుగు వేసుకుంటూ చావడి గదిలో ఉన్న పడకకుర్చీవైపు నెమ్మదిగా నడిచి వెళ్లాడు వీరయ్య.